




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 167 | ది.4-10-2026 | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 167 | Date : 4-10-2026 | Sunday | Pages : 8 | Rs.1/- |


## అమరావతిలో శాశ్వత పాన్ ఐఐటీ కౌన్సిల్

- వచ్చే ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్
- క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు





**అమరావతి, అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్యూ-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు. తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు.

**అమరావతి డిక్లరేషన్.. డీప్‌టెక్‌కు ఊతం..** ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన 'అమరావతి డిక్లరేషన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమరావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.

**క్వాంటం వ్యాలీగా అమరావతి: సీఎం చంద్రబాబు..** ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ సీఎంలారా...మీరు రాజీనామా చేసి రండి

- జ్ఞానేశ్ కుమార్ కు, బీజేపీకి ఏం సంబంధం?
- ఆయన ఎన్డీఏ మంత్రి కాదు... సీఈసీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ
- ఇండీ కూటమికి జనాదరణ లేదు
- సర్ వల్లే గెలిచామని కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితల చెప్పారు కదా
- మచ్చార్ ధైర్య సాహసాలపై తెలిసినా స్పందించని వాళ్లంతా దేశద్రోహులే
- హిందూ ఆలయాలపై దాడి చేసిన వాళ్లను పిచ్చోడని ముద్ర వేయడం ప్రభుత్వానికి అలవాటైంది
- పిచ్చోళ్లు మందిరాలపైనే దాడులు చేస్తారా?... ఇతరుల ప్రార్థనా స్థలాలు కన్పించవా?
- అనివార్య కారణాలవల్ల అమిత్ షా టూర్ వాయిదా పడింది
- కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్....



**హైదరాబాద్, అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** కేంద్ర ఎన్నికల కమిషన్ పైన, ఈవీఎం యంత్రాలపై పదేపదే ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. "ఈవీఎంల వల్లే కాంగ్రెస్ పార్టీ కేరళ, తెలంగాణ, కర్నాటక, హిమాచల్ ప్రదేశ రాష్ట్రాల్లో గెలిచింది కదా? మరి ఆ నాలుగు రాష్ట్రాల సీఎంలు రాజీనామా చేసి కాంగ్రెస్ ప్రభుత్వాలను రద్దు చేసి బ్యాలెట్ పేపర్లతో మళ్లీ ఎన్నికల్లోకి వెళ్లేందుకు సిద్ధమా? పదేపదే ఈవీఎంల గురించి, సర్ గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు దమ్ముంటే నా సవాల్ ను స్వీకరించాలి."అని అన్నారు. ప్రపంచమంతా కెప్టెన్ స్మిత్ మచ్చార్ ధైర్య సాహసాలను కొనియాడతుంటే రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలు కనీసం స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. స్మిత్ మచ్చార్ పై దాడి చేసిన వ్యక్తి సామాజికవర్గం ఓట్లు పోతాయోననే భయంతోనే కాంగ్రెస్ నేతలు నోరు మెదపడం లేదన్నారు. స్మిత్ మచ్చార్ సాహసం, తెగువ తెలిసినా స్పందించని వాళ్లంతా తన దృష్టిలో దేశద్రోహులు, దిమాగీ నక్సల్సేనని అన్నారు. ఈరోజు సాయంత్రం హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ నేతలు డాక్టర్ మనోహర్ రెడ్డి, సంగప్ప, శ్రీవర్ధన్ రెడ్డి తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యాంశాలు... కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈరోజు రాత్రి తెలంగాణకు రావాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలవల్ల ఆయన పర్యటన వాయిదా పడింది. దిల్ సుక్ నగర్ లో సంతోషీమాత దేవాలయంలో దాడి హేయనీయం. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దాడి చేసిన వాళ్లపై చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. దాడి చేసిన మతం వాళ్లు బాధపడతారనే కారణంతో ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రజలు ప్రశ్నిస్తే... దాడి చేసినోడిని పిచ్చోడిగా చిత్రీకరించడం ప్రభుత్వానికి అలవాటైంది. పిచ్చోడికి మందిర్, మసీదు అనే తేడా తెల్వదు. కానీ మందిరాలపైనే ఎందుకు దాడి చేస్తున్నారు. హిందువుల ధీటుగా స్పందించకపోవడంవల్లే ఈ దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం పద్ధతి మార్చుకుని దాడి చేసిన వాళ్లపై కఠినాతికఠినంగా వ్యవహరించాలి. లేకపోతే యువత రోడ్లపైకి వచ్చి తిరగబడితే వాళ్లను ఆపే పరిస్థితి ఉండదు. ఆలయాలపై దాడుల ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కు, బీజేపీకి ఏం సంబంధం?. ఆయన ఎన్డీఏ మంత్రి కాదు... సీఈసీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ. అసలు ఇండీ కూటమికి జనాదరణ లేదు. వాళ్ల ఆందోళన కార్యక్రమాలకు పట్టుమని పది మంది కూడా రావడం లేదు. ముంబై, ఢిల్లీలో జరిగిన ఆందోళనలకు జనం పెద్దగా రాకపోవడమే నిదర్శనం. సర్ ప్రక్రియలో భాగంగా సీపీఎం దొంగ ఓట్లను తొలగించడంవల్లే కేరళలో అధికారంలోకి వచ్చామని కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితల చెప్పారు కదా. మరి దీనికి కాంగ్రెస్ నేతలు ఏమంటారు? ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస నేతలకు సవాల్ విసురుతున్నాం.

## భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు.. వాహనదారులకు నయారా షాక్

- పెట్రోల్‌పై రూ.5 పెంచిన నయారా ఎనర్జీ
- డీజిల్‌పై లీటరుకు రూ.3 పెంపు
- శనివారం నుంచి అమల్లోకి కొత్త ధరలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** వాహనదారులకు నయారా ఎనర్జీ షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచింది. పెట్రోల్‌పై లీటరుకు రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ పెంపు శనివారం నుంచి అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా నయారా ఎనర్జీకి ఉన్న 7,000కు పైగా పెట్రోల్ బంకుల్లో కొత్త ధరలు అమలవుతున్నాయి. అంతర్జాతీయంగా ముడిచమురు, ఇంధన ధరలు పెరగడంతో కొనుగోలు వ్యయం పెరిగిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది నయారా ఎనర్జీ ఇంధన ధరలను పెంచడం ఇది రెండోసారి. మార్చిలోనూ పెట్రోల్, డీజిల్‌పై ఇదే స్థాయిలో ధరలు పెంచింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో అప్పట్లో ధరలు పెంచింది. ముడిచమురు ధరలు తగ్గడంతో జులైలో ఆ పెంపును వెనక్కి తీసుకుంది. ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలను మార్చలేదు.

## ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చడమే మా లక్ష్యం

- చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది
- పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకునేలా ఉండాలి
- పరిశ్రమదారులను మేం జాతి నిర్మాణకర్తలుగా భావిస్తున్నాం
- పాన్ ఐఐటి సమ్మిట్ -2026లో విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్




**అమరావతి,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** భారతదేశం ఇప్పటివరకు చూడని మార్పు, అభివృద్ధి, సుపరిపాలనని తీసుకురావడానికి మేము తపన పడుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చేందుకు మా టీం ఉమ్మడి లక్ష్యంతో పనిచేస్తోందని ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. పాన్ ఐఐటి సమ్మిట్ -- 2026లో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మేము అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎదగాలి... మోదీజీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి మా వంతు సహకారం అందించాలన్నదే మా ధ్యేయం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం 4.0 ఆపరేటింగ్ సిస్టమ్ తో మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. ఆయనకు ఇప్పుడు ఒక యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది. 50% శాసనసభ్యులు మొదటిసారి గెలిచినవారే, 25 మంది మంత్రులలో 17 మంది మొదటిసారి మంత్రులైనవారు. అనుభవజ్ఞమైన సాఫ్ట్‌వేర్‌కు యువ, డైనమిక్ హార్డ్‌వేర్ కలయికే నేటి ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా, విభిన్నంగా నిలబెడుతోంది. మా టీమ్‌కు ఒక స్పష్టమైన విజన్ ఉంది. ఏ రంగమైనా ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలి. నా దృష్టిలో పాన్ ఐఐటీ అంటే కంపెనీలు, టెక్నాలజీలు, పరిశోధనా సంస్థలు మొత్తం పరిశ్రమలను నిర్మించిన వ్యక్తులు. పాన్ ఐఐటీ 23 ఐఐటీల పూర్వ విద్యార్థులందరినీ ఒకచోట చేర్చుతుంది. భారతదేశం అంతటా, ప్రపంచ ప్రధాన టెక్నాలజీ హబ్ లలో 5 లక్షలకు పైగా ఐఐటీ గ్రాడ్యుయేట్లను కలుపుతుంది. ఈ కమ్యూనిటీ మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో సమావేశం కావడం ఆనందంగా ఉంది.

**భారత్ అభివృద్ధికి దశాబ్దం చాలు..** అమెరికా, యూరప్ దేశాలు అభివృద్ధి చెందిన దేశాలుగా మారడానికి దాదాపు 100 సంవత్సరాలు పట్టింది. దుబాయ్ దాదాపు 30 సంవత్సరాల్లో, సింగపూర్ సుమారు 25 సంవత్సరాల్లో ఆ స్థాయికి చేరుకున్నాయి. భారత్ ఇప్పుడు ఒక కీలక దశలో ఉంది, అభివృద్ధి సాధించడానికి ఒక దశాబ్దం సరిపోతుందని నేను నమ్ముతున్నాను. ఆ 'గోల్డెన్ డికేడ్' మనదే కావాలి. దీనికి త్రీ "ఎస్" మంత్రమే ఆధారం. మొదటిది --- స్పీడ్, రెండవది --- సర్వీస్, మూడవది --- స్టెబిలిటీ. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వేగాన్ని చూస్తే స్పీడ్ కు అర్థం తెలుస్తుంది. మా టీమ్ ఇప్పుడు ఆతృతతో ఉంది. ప్రజలు మాకు ఇచ్చింది ఐదు సంవత్సరాల సమయం. ఆ సమయంలోనే ఫలితాలు చూపించాలి. కేవలం ఎంఓయులు కుదుర్చుకుని వాటిని మర్చిపోయే పని మాది కాదు. ప్రాజెక్టులకు వాస్తవ రూపమిచ్చి, వాటి ద్వారా ఉద్యోగాలు సృష్టించాలన్న తపన మాది. రెండోది సర్వీస్. పరిశ్రమల అభివృద్ధిలో ప్రభుత్వానిది ఎంతో కీలకమైన పాత్ర ఉందని మేము నమ్ముతున్నాం. వ్యవస్థాపకులు, పరిశ్రమలను మేము 'జాతి నిర్మాణకర్తలు'గా భావిస్తున్నాం. మీతో కలిసి పనిచేయాలి, ప్రతి పాలసీని మీతో కలిసి రూపొందించాలి. ప్రపంచ స్థాయి పాలనను అందించాలి. అదే మా సేవా దృక్పథం. నిజానికి, రాష్ట్రంలోని టాప్ ప్రాజెక్టులపై వ్యక్తిగతంగా నేను శ్రద్ధ వహిస్తాను. ప్రతి శనివారం సాయంత్రం లేదా ఆదివారం ఉదయం ప్రమోటర్లకు వారి ప్రాజెక్టులపై వ్యక్తిగత అప్‌డేట్ పంపుతాను. ఆ సమయంలో వారు తమ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్ట్ గురించి చదివే సమయం ఉంటుంది.


**మహారాజశ్రీ విజయవాడ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్ట్ లో**

ఓ.ఎస్.నెంబర్. 49 / 2022

బిట్వీన్ :

ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ, రిప్రజెంటెడ్ బై జిపిఏ హోల్డర్, విజయవాడ.

------వాది

మరియు

1. షేక్ మహమ్మద్ ఖలిద్, S/o. మహమ్మద్ ఆజాం, నివాసం : డోర్ నెం.8-4, Flat No. 407, జయదుర్గ అపార్ట్మెంట్స్, కామయ్యతోపు సెంటర్, యం.జి రోడ్డు, ఇండియన్ బ్యాంకు ఎదురు, కానూరు, పెనమలూరు, కృష్ణా- 520007, ఆంధ్రప్రదేశ్.
2. క్రేస్సెంట్ క్లాతింగ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ మేనేజింగ్ పార్ట్నర్, షేక్ మహమ్మద్ ఖలీద్, S/o. మహమ్మద్ ఆజాం, నివాసం : డోర్ నెం.29-27-33ఎ, సూర్య నారాయణ స్ట్రీట్, సూర్యారావు పేట, విజయవాడ - 520002

------ప్రతివాదులు

పై నెంబరు దావా నందు పైన తెలిపిన ప్రతివాదులకు దావా సమన్లు అందజేయు నిమిత్తం ది.16-11-2026 వ తేదీకి వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాదులు వాయిదా రోజు ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి వారికి గల ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేని యెడల వారి పరోక్షమందు సదరు పై దావా తీర్మానము కాబడునని ఇందుమూలముగా తెలియచేయటమైనది.

(కోర్ట్ వారి ఉత్తర్వులు ప్రకారము)

వాయిదా తేది : 16-11-2026

ఇట్లు

**కునుకు రాజశేఖర్**

వాది తరపు అడ్వకేట్

గాంధీనగర్, విజయవాడ-520003


## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లిన ఏపీ ప్రభుత్వం

- బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న నారాయణ
- గత ప్రభుత్వం వల్లే అమరావతి అభివృద్ధి ఆగిపోయిందన్న మంత్రి నారాయణ



**అమరావతి,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే 123 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి నారాయణ వివరించారు. ఇందుకోసం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించామని, ఇందులో ఒక్క రాజమండ్రి అభివృద్ధి పనులకే రూ.1,000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, పుష్కరాల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.5,350 కోట్ల నిధులు వినియోగించుకోకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను కేంద్రం సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు. అమరావతి అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 2028 చివరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2027లో 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో రోడ్లు, ఘాట్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల పనులను వివిధ శాఖలు సమన్వయంతో చేపడుతున్నాయి.

## పేదల సొంతింటి కలకు తాన్లా ఫౌండేషన్ అండ

- సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో రూ.300 కోట్లతో 5,000 ఇళ్ల నిర్మాణం
- దసరా పండుగ రోజున భూమిపూజ
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





**సత్తుపల్లి,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ఒకవైపు కృషి చేస్తుండగా.. దాతృత్వ సంస్థలు కూడా ప్రభుత్వంతో చేతులు కలపడం అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లోని నిరుపేదల కోసం తాన్లా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉదయ్ కుమార్ రెడ్డి సొంత నిధులతో సుమారు రూ.300 కోట్ల అంచనా వ్యయంతో 5,000 ఇళ్లను ఉచితంగా నిర్మించి ఇవ్వడానికి ముందుకు వచ్చారని తెలిపారు. దసరా పండుగ రోజున ఈ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. సత్తుపల్లి మండలం బేతుపల్లి గంగారం గ్రామంలో తాన్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ ఆరోగ్య కేంద్రం, ల్యాబొరేటరీలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా రక్తపరీక్ష చేయించుకున్నారు. అనంతరం వైద్యాధికారులు, రోగులతో మాట్లాడి అక్కడ అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే, తాన్లా ఫౌండేషన్ తరఫున ఉదయ్ కుమార్ రెడ్డి తన సొంత నిధులతో 5,000 ఇళ్లను నిర్మించి ఇస్తానని ముందుకు వచ్చారని తెలిపారు. పేద కుటుంబాలకు కేవలం ఇల్లు మాత్రమే కాకుండా ఆత్మగౌరవంతో జీవించే సొంత చిరునామా కల్పించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన ముందుకు తీసుకెళ్లేందుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, జారే ఆదినారాయణ సమన్వయంతో అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పేదలకు ఆరోగ్యం.. అంతర్జాతీయ ప్రమాణాలతో క్యాన్సర్ ఆసుపత్రి నారాయణపురం గ్రామంలో పేదలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు శ్రీ షిరిడి సాయి జనమంగళం ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందని మంత్రి తెలిపారు.

# ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

**- తక్షణ చర్యలు తీసుకోండి**

**- బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండె గణేష్ ముదిరాజ్**



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 3 (వార్తాప్రభ):** మక్త మహబూబ్‌పేట్ 241 డివిజన్ స్మశానవాటికలో ఓపెన్ డ్రైనేజీతో మురుగునీరు బహిరంగంగా ప్రవహిస్తుండటంతో దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుండె గణేష్ ముదిరాజ్ తెలిపారు.సమస్యపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం దారుణమన్నారు.తక్షణమే డ్రైనేజీ సమస్యను పరిష్కరించి శాశ్వత పైపులైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సారా రాము, గంగారం మల్లేష్, గుండె గోపాల్ పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థినికి సైకిల్ అందజేత.



**తొర్రూరు అక్టోబర్ 03 (వార్తాప్రభ):** లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి ఆధ్వర్యంలో తొర్రూరు జిల్లా పరిషత్ హై స్కూల్ 9వ తరగతి విద్యార్థిని శరణ్యకు సైకిల్‌ను అందజేశారు. విద్యార్థినుల విద్యాభ్యాసానికి, పాఠశాలకు సులభంగా రాకపోకలు సాగించేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బ్రహ్మానంద రెడ్డి హాజరయ్యారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి అధ్యక్షురాలు రేణుకాదేవి, కార్యదర్శి వా. నిత్య, క్లబ్ సభ్యులు జ్యోతి, విజయ పాల్గొని విద్యార్థినికి సైకిల్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, సబీహాబాను, అశోక్ రెడ్డి, వెంకన్నతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటింటికి త్రాగునీరు అందించడమే మా లక్ష్యం

**22వ వార్డు కౌన్సిలర్ నడికూడ అనిత రఘునాథ్ యాదవ్**



**షాద్ నగర్, అక్టోబర్ 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో మిషన్ భగీరథ నీళ్లు ప్రతి ఇంటికి అందేలా చూడడమే మా లక్ష్యం అని కౌన్సిలర్ నడికూడ అనిత రఘునాథ్ యాదవ్ అన్నారు.ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్లు రావడానికి కాలనీలోనీ ఇండ్లకు పైప్ లైన్ ను అమర్చడం జరిగింది,ఈ సందర్భంగా కాలనీ వాసులకు నీటి కష్టాలు ఇకముందు లేకుండా సహకరించినందుకు హర్షం వ్యక్తం చేశారు.ఇట్టి కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నడికూడ రఘునాథ్ యాదవ్,నాగరాజు,రవీందర్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ధార్మిక్ సెల్ కో కన్వీనర్‌గా లాన వెంకట్ నియామకం

**నియామక పత్రం అందజేసిన రాష్ట్ర కన్వీనర్ అన్నవజ్జుల సూర్యప్రకాష్ రావు**

**పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు**



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 3, (వార్తాప్రభ) :** భారతీయ జనతా పార్టీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ధార్మిక్ సెల్ కో కన్వీనర్‌గా లాన వెంకట్ బాధ్యతలు స్వీకరించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర ధార్మిక్ సెల్ కన్వీనర్ అన్నవజ్జుల సూర్యప్రకాష్ రావు చేతుల మీదుగా ఆయన అధికారిక నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు నూతనంగా నియమితులైన లాన వెంకట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సనాతన ధర్మ పరిరక్షణతో పాటు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, ధార్మిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని లాన వెంకట్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ధార్మిక్ సెల్ మేడ్చల్ జిల్లా కన్వీనర్ చంద్రమౌళి, జిల్లా కో కన్వీనర్ శ్రీశైలం, కుత్బుల్లాపూర్ కన్వీనర్ బళ్లారి చంద్రశేఖర్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తొర్రూరు మున్సిపల్ చైర్మన్, కమిషనర్ లు ఒంటెద్దు పోకడలు మానుకోవాలి.

## -సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు.



**తొర్రూరు అక్టోబర్ 03 (వార్తాప్రభ ):** తొర్రూరు మున్సిపల్ చైర్మన్,కమిషనర్ ఒంటెద్దు పోకడలు మానుకోవాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.తమకు సంబంధం లేకుండా తీర్మానాలు చేస్తున్నారంటూ ఆరోపిస్తూ మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం బీఆర్ఎస్ కౌన్సిలర్లు బహిష్కరించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి ముందు కౌన్సిలర్లతో తీర్మానాలపై చర్చించాల్సి ఉంటుందని,వాటినే సమావేశంలో ఎజెండాగా పెట్టాల్సి ఉంటుందని తెలిపారు. దానికి విరుద్ధంగా మున్సిపల్ చైర్మన్,కమిషనర్ సభ్యులకు తెలియకుండా వారికి వారే అంశాలు నిర్ణయించుకుని ఎలాంటి చర్చ లేకుండా సమావేశంలో ఏకపక్షంగా పెట్టాలని చూడటం దారుణమన్నారు. తెలంగాణ మున్సిపల్ చట్టంను అనుసరించి చైర్మన్,కమిషనర్ వ్యవహరించాల్సి ఉంటుందని, దానికి విరుద్ధంగా పాలకుడు, అధికారి వ్యవహరిస్తున్నారన్నారు. ఎజెండా కాపీలు సభ్యులకు అందజేయకుండా జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు.తొర్రూరు పట్టణ అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు సహకరిస్తామని తెలిపినప్పటికీ...అధికార పార్టీ చైర్మన్,కమిషనర్ ప్రతిపక్ష సభ్యుల గొంతు నొక్కుతున్నారన్నారు.కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు సంబంధించి సైతం కమిషనర్ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని అన్నారు.పట్టణ అభివృద్ధికి కాకుండా సొంత అభివృద్ధి కోసం పాకులాడుతున్నారని, ఈ విషయంలో పాలకవర్గం తీరు మారకపోతే ఉన్నతాధికారులను కలిసి నివేదిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్లు కర్నే నాగరాజు, భూసాని జయమ్మ ఉప్పలయ్య, తూర్పాటి రవి, పేర్ల జంపన్న, చకిలేల అలివేలు, మాడుగుల భవానీ లత, అల్లం శ్యామల శ్యామ్, కిన్నెర కవిత సతీష్, ధరావత్ పద్మ కిషన్ నాయక్, మాజీ కౌన్సిలర్లు ధరావత్ జైసింగ్ నాయక్, గుగులోత్ శంకర్,నాయకులు రాయిశెట్టి వెంకన్న, భూసాని ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎర్రదొడ్డి భాస్కర్ రెడ్డి



**కూకట్ పల్లి, అక్టోబర్3(వార్తా ప్రభ):** కలికిరి మండలం, మహల్ జిల్లా పరిషత్ ఉన్నత (తెలుగు) పాఠశాల పూర్వ విద్యార్థి, కలకడ మండలం, కత్తివారిపల్లికి చెందిన ఎర్రదొడ్డి భాస్కర్ రెడ్డి తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు.ఈ మేరకు తెలంగాణ రెడ్డి సంఘం నాయకులు ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ,తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా కీలక బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రెడ్డి సంఘం అధ్యక్షులు బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్ల సంజీవ రెడ్డి, జనరల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొట్టం మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సంఘం ఆశయాలు, లక్ష్యాల సాధనకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తెలంగాణలో ఆర్థికంగా వెనుకబడిన పేద రెడ్డి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తానని భాస్కర్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై అవగాహన కల్పించడం, రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై చైతన్యం తీసుకురావడం, విదేశీ విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలపై అవగాహన కల్పించడం, అలాగే అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం వంటి అంశాలపై సంఘం ద్వారా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. పేద రెడ్డి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు, విద్య, ఉపాధి, ఆర్థిక సహాయం వంటి అంశాల్లో అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు, తెలంగాణ రెడ్డి సంఘం ఐక్యతను మరింత బలోపేతం చేయడం, సంఘ కార్యకలాపాలను విస్తృతం చేయడం, సమాజ అభివృద్ధికి ఉపయోగపడే కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం కోసం సంఘం నాయకత్వంతో కలిసి నిరంతరం పనిచేస్తానని భాస్కర్ రెడ్డి స్పష్టం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతను సేవా దృక్పథంతో నిర్వర్తిస్తూ, సంఘ సభ్యుల సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

# హెచ్చరిక బోర్డుల్లేవు.. వాహనదారులకు తిప్పలే

**సొంత ఖర్చుతో సూచికలు ఏర్పాటు చేసిన సామాజిక కార్యకర్త**




**సూరారం, అక్టోబర్ 3, (వార్తాప్రభ)** రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న మార్గంలో కనీస హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సూరారం కూడలి నుంచి బౌరంపేట్, శంభీపూర్, ఐడీఏ బొల్లారం, మియాపూర్ వైపు వెళ్లే మార్గంలో సూరారం గ్రామం విశ్వకర్మ కాలనీ దాటిన తర్వాత విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. అయితే పనులు జరుగుతున్న విషయాన్ని తెలిపేలా సూచికలు, హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడంతో భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలు, కార్లు సుమారు రెండు కిలోమీటర్ల మేర ముందుకు వెళ్లి తిరిగి వెనుదిరగాల్సి వస్తోంది.

**ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచిస్తూ బోర్డులు** వాహనదారుల అవస్థలను గమనించిన మాజీ లారీ యజమాని, నార్త్ రన్ సిటీ ఇసుక లారీల సంఘం మాజీ కార్యదర్శి, సామాజిక--పర్యావరణ కార్యకర్త రవీందర్ ముదిరాజ్ స్పందించారు. అధికారుల కోసం వేచిచూడకుండా తన సొంత ఖర్చుతో మూడు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. సూరారం చౌరస్తా నుంచి కట్టమైసమ్మ ఆలయం--బహదూర్‌పల్లి ఎక్స్‌రోడ్ మీదుగా ఎడమవైపు తిరిగి బౌరంపేట్, ఐడీఏ బొల్లారం, బాచుపల్లి వైపు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగేందర్, బాబు, నవీన్‌కుమార్, కార్తీక్, రాకేష్, సాయి పాల్గొన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పడుతున్న ఇబ్బందులను గుర్తించి స్వచ్ఛందంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన రవీందర్ ముదిరాజ్‌కు స్థానికులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతాయుతమైన ఇలాంటి వ్యక్తుల చొరవ అభినందనీయమని కొనియాడారు.

# సామాజిక న్యాయం తెలంగాణ రక్షణ సేనతోనే సాధ్యం

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం**

**'పాంచజన్య' ఆశయాలతో భద్రాద్రిలో పార్టీ విస్తరణకు శ్రీకారం**

**తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు సముద్రాల క్రాంతికుమార్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కొత్తగూడెం, అక్టోబర్ 3: తెలంగాణలో సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం సాధించడమే తెలంగాణ రక్షణ సేన ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సముద్రాల క్రాంతికుమార్ అన్నారు. జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి.విద్యానగర్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరిన క్రాంతికుమార్, పోస్ట్‌ఆఫీస్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుని ఘనంగా నివాళులర్పించారు.అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ ప్రకటించిన 'పాంచజన్య' ఆశయాల అమలుకు కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు. జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని అన్నారు.పాంచజన్యమే కార్యాచరణకు పునాదితెలంగాణ రక్షణ సేన ప్రతిపాదించిన 'పాంచజన్యం'లో ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు క్రాంతికుమార్ తెలిపారు. ఈ అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు యువతకు పార్టీలో అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.జిల్లాలోని ప్రతి గ్రామం, పట్టణం, మండలంలో పార్టీ విస్తరణకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. యువత, మహిళలు, రైతులు, కార్మికులు, విద్యార్థులను పార్టీతో అనుసంధానం చేస్తూ పార్టీ కేడర్‌ను బలోపేతం చేస్తామని అన్నారు.సింగరేణి కార్మికుల సమస్యలు, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత, యువతకు ఉపాధి అవకాశాలు, రైతుల సమస్యలతో పాటు కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ప్రజల తరపున పోరాటం చేస్తామని క్రాంతికుమార్ వెల్లడించారు.ఈ సమావేశంలో టీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.వీరన్న, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి చైతన్య, కార్మిక విభాగం జిల్లా నాయకుడు వాంకుడోత్ రవి, విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు లకావత్ సురేష్, ఇల్లందు ఇన్‌చార్జి రామకృష్ణ, అశ్వారావుపేట ఇన్‌చార్జి సోడెం వెంకట్, జిల్లా నాయకులు ముసలం రామకృష్ణ, ఖలీల్, పృథ్వీరాజ్, పవన్ నాయక్, ఆది, రాంబాబు, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, సకాలంలో పూర్తి చేయండి

**వరద నీటి కాలువ, సీసీ రోడ్ల నిర్మాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ**





**శేరిలింగంపల్లి,అక్టోబర్ 3 (వార్తాప్రభ):**హఫీజ్‌పేట్ డివిజన్ వైశాలినగర్ కాలనీలో రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద రూ.70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన వరద నీటి కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. సీనియర్ నాయకుడు బాలింగ్ గౌతమ్ గౌడ్, సీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు.మంజీరా పైప్‌లైన్ రోడ్డు నుంచి మసీద్‌బండకు వెళ్లే మార్గంలోని రైల్వే అండర్‌పాస్‌లో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేలా పనులు చేపట్టినట్లు గాంధీ తెలిపారు.పనులు తుది దశలో ఉన్నాయని,వారం రోజుల్లో రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. వరద నీటి కాల్వ, సీసీ రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సీఎంసీ డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, నాయకుడు సత్యం, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు,తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర విచారణ జరిపించండి.

**- ఏ.ఐ.ఎఫ్.డి.ఎస్.డిమాండ్**




**శేరిలింగంపల్లి,అక్టోబర్ 3 (వార్తాప్రభ):**సీఎంఎస్ చందానగర్ క్యాంపస్‌లో విద్యార్థులు,తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కమిటీ చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ పిటిషన్ సమర్పించింది.కళాశాల అడ్మిషన్లు, ఫీజుల వసూళ్లు, విద్యార్థుల నుంచి తీసుకున్న పత్రాలు, టీసీలు, బోర్డు ప్రక్రియకు సంబంధించిన వివరాలు, అడ్మిషన్ సమయంలో ఇచ్చిన హామీలపై దర్యాప్తు చేయాలని పిటిషన్‌లో కోరారు.విద్యార్థులు,తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల విద్యాభవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపే అంశాలను పరిశీలించి,ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్ కోరింది.అక్టోబర్ 3న ఉదయం 11:59 గంటలకు పిటిషన్ సమర్పించగా పోలీస్ శాఖ CYB/CNR_CYB/031026/02585 స్వీకరణ నంబర్ జారీ చేసింది.విద్యార్థుల సమస్యలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, తప్పు చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి డిమాండ్ చేశారు.

## నేడు తొర్రూరు పట్టణ పరిధిలో విద్యుత్ అంతరాయం.

**- తొర్రూరు విద్యుత్ డివిజనల్ అధికారి కృష్ణ.**



**తొర్రూరు అక్టోబర్ 03 (వార్తాప్రభ):** నేడు తొర్రూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నందు విద్యుత్ సరఫరాలను మెరుగుపరిచేందుకు 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ను 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ గా కెపాసిటీ పెంచే విషయంలో ఆదివారం ఉదయం 7 గంటలనుండి సాయంత్రం 6 గంటలవరకు తొర్రూరు పట్టణం, చింతలపల్లి, పాలకేంద్రం, సోమ్లా తండా, దుబ్బతండ, కొమ్మనపల్లితండ తదితర ప్రాంతాల వినియోగదారులు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తొర్రూరు డివిజన్ ఇంజనీర్ ఎన్ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తొర్రూరు పట్టణంతోపాటు తొర్రూరు పట్టణ పరిధిలో ఉన్న పైన తెలిపిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సంపాదకీయం

## "వై నాట్ పులివెందుల" - కూటమి గర్జన, జగన్ హై అలర్ట్!

స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఏపీలో రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ముఖ్యంగా గత స్థానిక ఎన్నికల్లో వైట్ వాష్ కు గురైన ప్రస్తుత అధికార కూటమి ఇప్పుడు విపక్షానికి అదే పరిస్థితి తీసుకురావాలని పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా వైనాట్ పులివెందుల అంటూ నినదించడమే కాకుండా, విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గంలో మెజార్టీ సీట్లను గెలుచుకునే వ్యూహంతో పనిచేస్తోందని చెబుతున్నారు. గతంలో జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, వైనాట్ 175, వై నాట్ కుప్పం అంటూ నినాదాలు చేసేవారు. ఇప్పుడు కూటమిలో ముఖ్యనేతలు ఆ విధమైన ప్రకటనలు చేయకపోయినా, పులివెందులలో జగన్మోహనరెడ్డికి ఓటమి రుచి చూపించాలనే లక్ష్యంతోనే అడుగులు వేస్తున్నట్లుగా సంకేతాలు పంపుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో ఇప్పటివరకు ఆయన కుటుంబానికి ఎదురులేకుండా పోయింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో కూడా ఈ నియోజకవర్గంలో పోటీపై పెద్దగా దృష్టి పెట్టేవారు కాదని చెబుతున్నారు. జగన్మోహనరెడ్డి తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయాల్లోకి వచ్చిన నుంచి పులివెందుల నియోజకవర్గం ఆ కుటుంబానికి కంచుకోటగా ఉండగా, వైఎస్ ఆ తర్వాత జగన్ రెడ్డి చెప్పిన వారికే స్థానిక పదవులు దక్కేవి. అయితే గత ప్రభుత్వంలో జగన్మోహనరెడ్డి అనుసరించిన విధానాలు కారణంగా ప్రతిపక్ష నేతలకు బలమైన స్థానాల్లో కూడా ఆయా పార్టీలు పోటీ చేసే వాతావరణం లేకుండా పోయిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే ఎన్నికల్లో అలాంటి వాతావరణం లేకపోయినా ప్రజాస్వామ్యయుతంగానే పోరాడి వైసీపీని ఓడించాలని కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారని అంటున్నారు. గత ఏడాది జరిగిన పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అనూహ్య విజయం సాధించగా, వైసీపీ అభ్యర్థికి కనీసం డిపాజిట్ రాలేదు. దీంతో గట్టిగా ప్రయత్నిస్తే పులివెందుల నియోజకవర్గంలో మెజార్టీ నియోజకవర్గాలను కైవసం చేసుకోవచ్చునని టీడీపీ కూటమి ప్లాన్ చేస్తోందని అంటున్నారు. ప్రధానంగా వైఎస్ ఫ్యామిలీకి తిరుగులేని బలం ఉన్న పులివెందుల నగర పంచాయతీలో పసుపు జెండా ఎగరవేయాలనే వ్యూహంతో టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికే వైసీపీలో ఉన్న కొందరితో చర్చలు సాగిస్తున్నారని కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కూడా స్వయంగా రంగంలోకి దిగినట్లుగా చెబుతున్నారు. జగన్ రెడ్డి ఫోకస్ అధికార పార్టీ 'వై నాట్ పులివెందుల' అంటుండటంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అలర్ట్ అయ్యారని చెబుతున్నారు. ప్రతిపక్ష నేతల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న మాజీ సీఎం జగన్ రెడ్డి పార్టీ శ్రేణులు చేయిదాటిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కడప ఎంపీ అవినాశ్ రెడ్డికి దిశానిర్దేశం చేశారని అంటున్నారు. అదేసమయంలో ముఖ్యమైన కార్యకర్తలతో జగన్ రెడ్డి స్వయంగా మాట్లాడుతూ అధికార పార్టీ ప్రలోభాలకు లొంగవద్దని, తాను ఉన్నానని భరోసా ఇస్తున్నట్లు చెబుతున్నారు. ఇక జగన్ రెడ్డి సూచనలతో ఎంపీ అవినాశ్ రెడ్డితోపాటు ఇతర కుటుంబ సభ్యులు, వైసీపీ ముఖ్యనేతలు నియోజకవర్గంలో పట్టు సడలకుండా పకడ్బందీ వ్యూహరచన చేస్తున్నారని అంటున్నారు. దీంతో పులివెందుల రాజకీయం హాట్ హాట్ గా మారిందని చెబుతున్నారు.

## "సుజనా ఫౌండేషన్"ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 3 :(వార్త ప్రభ ప్రతినిధి)** పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, "సుజనా ఫౌండేషన్" ద్వారా ప్రతి వారం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. హెచ్ బీ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన "సుజనా ఫౌండేషన్" ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు... ఈ వైద్య శిబిరంలో డెంటల్, కంటి పరీక్షలు , ఈ సీ జీ, 2డి ఎకో, ఎక్స్ రే, బీ పీ, షుగర్ వంటి రక్త పరీక్షలతో పాటు జనరల్ ఫిజీషియన్స్ వైద్య సేవలందించారు. .కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే సుజనా చౌదరి ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ వైద్య శిబిరం లో 160 మందికి నిపుణులైన వైద్యుల బృందం ప్రత్యేక శ్రద్ధతో చికిత్సలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు..మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య , 42 వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనూష,42 వ డివిజన్ బీజేపీ ఇన్చార్జ్ బెన్నా భక్తుల సోమేశ్వరరావు ,43 వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షుడు బొల్లేపల్లి కోటేశ్వరరావు ఆంధ్రా హాస్పిటల్స్, శంకర నేత్ర చికిత్సలయం వైద్యులు, గవర్నమెంట్ డెంటల్ డాక్టర్స్ సుజనా మిత్రా కోఆర్డినేటర్లు , సుజనా ఫౌండేషన్ సిబ్బంది ఈ శిబిరంలో తమ సేవలందించారు...

## ఆపరేషన్ త్రిశూల్ పై అవగాహన కార్యక్రమం



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 03(వార్తా ప్రభ ప్రతినిధి):**ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాలతో, ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద ఆపరేషన్ త్రిశూల్ లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం సీఐ ఏ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళా భద్రత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఏదైనా అసాంఘిక కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వర్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దుర్గమ్మ దేవస్థానానికి 'స్వచ్ఛ ఆంధ్ర అవార్డు' రావడం అభినందనీయం

**లంకా గోవిందరాజులు (ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు)**




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 3 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మకమైన 'స్వచ్ఛ ఆంధ్ర అవార్డు -- 2026' లభించడం అత్యంత సంతోషదాయకమని, విజయవాడ నగరానికి ఇది ఎంతో గర్వకారణమని ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లంకా గోవిందరాజులు ఓ ప్రకటన లో కొనియాడారు.గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ఇనిషియేటివ్స్ (ఎస్ ఏ ఎస్ ఏ )' లో భాగంగా, గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా దేవస్థాన ఈవో వి.కె. శీనా నాయక్, మరియు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఈ పురస్కారాన్ని అందుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా లంకా గోవిందరాజులు మాట్లాడుతూ..."ఇంద్రకీలాద్రిపై పారిశుద్ధ్యం, వ్యర్థాల విభజన, ప్లాస్టిక్ రహిత వాతావరణం, పరిశుభ్రమైన మరుగుదొడ్ల నిర్వహణ వంటి కీలక అంశాలలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించి ఈ ఘనత సాధించడం అభినందనీయం.ముఖ్యంగా ఈవో వి.కె. శీనా నాయక్ నిరంతర పర్యవేక్షణ, నిబద్ధతతో కూడిన నిరంతర శ్రమ, సుపరిపాలన వల్లనే ఇంద్రకీలాద్రి భక్తుల ఆదరాభిమానాలను పొందుతూ స్వచ్ఛతలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది. దైవకార్యంలో నిరంతరం అందుబాటులో ఉంటూ, దేవస్థాన అభివృద్ధికి మరియు భక్తుల సౌకర్యాలకు ఎవరు ఏ విన్నపం తీసుకెళ్లినా వెంటనే స్పందించి పరిష్కరించే విలక్షణమైన శైలి శీనా నాయక్ ది వారి పనితీరు ఎవరికైనా సహకరించాలి, మద్దతుగా నిలవాలి అనే భావన కలిగిస్తుంది.రాష్ట్రప్రభుత్వ మార్గదర్శకత్వంలో ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు, మరియు క్షేత్రస్థాయిలో అహర్నిశలు కష్టపడే పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది అందరి ఉమ్మడి కృషికి దక్కిన దైవిక పురస్కారం ఇది." అని పేర్కొన్నారు.రాబోయే దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో కూడా ఇదే స్వచ్ఛతా ప్రమాణాలను కొనసాగిస్తూ, దుర్గమ్మ దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు పర్యావరణహితమైన వాతావరణంలో మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ.. ఈవో వి.కె. శీనా నాయక్ కి, పాలకమండలికి, దేవస్థాన సిబ్బందికి ఏఐవైఫ్ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## టెండర్ల ప్రక్రియని చీటీ పాటలు లాగా మార్చకండి

**● నిబంధనలకు వ్యతిరేకంగా టెండర్లు పిలిచి కార్మిక శ్రమని దోచి పెట్టవద్దు ● రూ.,450/-లు టెండర్ పాడితే కార్మికునికి ఎంత ఇస్తారు? ● కాంట్రాక్టర్ ఎంత తీసుకుంటాడు? చెప్పుల స్టాండులకు ఎంత ఖర్చు పెడతారు? ● కార్మిక శక్తిని దోచుకునే కాంట్రాక్టులను అధికారులు వ్యతిరేకించాలి ● కనీస వేతన చట్టం అమలు చేస్తూ మళ్ళీ కాంట్రాక్టులు పిలవాలి**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 3 :(వార్త ప్రభ ప్రతినిధి)**కనీస వేతన చట్టం నిబంధనలను తుంగలో తొక్కి దసరా ఉత్సవాలలో చెప్పులు స్టాండ్ ఏర్పాటుకు ఇష్టం వచ్చిన రేటుకి టెండర్లు అప్పగించటం, కార్మిక శక్తిని దోచిపెట్టి కార్మిక చట్టాలను ఉల్లంఘించటమేనని విజయవాడ మున్సిపల్ ఎంప్లాయిస్ డ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా అన్నారు. శనివారం మధ్యాహ్నం కోమల విలాస్ సెంటర్ వద్ద 52 డివిజన్ పారిశుద్ధ్య కార్మికులతో జరిగిన సమావేశంలో కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సుమారు 240 మంది వర్కర్స్ తో చెప్పుల స్టాండులు ఏర్పాటు చేయటానికి ఒక వర్కర్ కి రోజుకి రు,, 450/-లు టెండర్ కోడ్ చేస్తే కార్మికునికి ఎంత ఇస్తారు, చెప్పుల స్టాండు సామగ్రి ఎలా కొంటారు? కాంట్రాక్టర్ కమిషన్ ఎంత తీసుకుంటాడు? ఇవన్నీ కూడా ఆలోచించకుండా అధికారులు టెండర్లు ఒకే చేయటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఒక కార్మికునికి కనీసం 700 రూపాయలు తగ్గకుండా ఒకరోజు వేతనం చెల్లించాలని కార్మిక చట్టాలు పేర్కొంటుంటే, అధికారులు ఏ విధంగా తక్కువ వేతనం ఆమోదిస్తారని ప్రశ్నించారు. అధికారులే కార్మిక చట్టాలను గౌరవించకపోతే చట్టాలు ఎలా అమలు అవుతాయని అన్నారు. తక్షణం రు,, 450/-ల టెండర్ను రద్దుచేసి కార్మిక చట్టాలకి అనుగుణంగా కొత్త టెండర్ కి అవకాశం కల్పించాలని ఆయన ఈ సందర్భంగా కమిషనర్ ని కోరారు.కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు జక్కి జేమ్స్, కోశాధికారితో తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## టెండర్ల ప్రక్రియని చీటీ పాటలు లాగా మార్చకండి.

**● నిబంధనలకు వ్యతిరేకంగా టెండర్లు పిలిచి కార్మిక శ్రమని దోచి పెట్టవద్దు ● రూ.,450/-లు టెండర్ పాడితే కార్మికునికి ఎంత ఇస్తారు? ● కాంట్రాక్టర్ ఎంత తీసుకుంటాడు? చెప్పుల స్టాండులకు ఎంత ఖర్చు పెడతారు? ● కార్మిక శక్తిని దోచుకునే కాంట్రాక్టులను అధికారులు వ్యతిరేకించాలి ● కనీస వేతన చట్టం అమలు చేస్తూ మళ్ళీ కాంట్రాక్టులు పిలవాలి**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 3 :(వార్త ప్రభ ప్రతినిధి)**కనీస వేతన చట్టం నిబంధనలను తుంగలో తొక్కి దసరా ఉత్సవాలలో చెప్పులు స్టాండ్ ఏర్పాటుకు ఇష్టం వచ్చిన రేటుకి టెండర్లు అప్పగించటం, కార్మిక శక్తిని దోచిపెట్టి కార్మిక చట్టాలను ఉల్లంఘించటమేనని విజయవాడ మున్సిపల్ ఎంప్లాయిస్ డ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా అన్నారు. శనివారం మధ్యాహ్నం కోమల విలాస్ సెంటర్ వద్ద 52 డివిజన్ పారిశుద్ధ్య కార్మికులతో జరిగిన సమావేశంలో కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సుమారు 240 మంది వర్కర్స్ తో చెప్పుల స్టాండులు ఏర్పాటు చేయటానికి ఒక వర్కర్ కి రోజుకి రు,, 450/-లు టెండర్ కోడ్ చేస్తే కార్మికునికి ఎంత ఇస్తారు, చెప్పుల స్టాండు సామగ్రి ఎలా కొంటారు? కాంట్రాక్టర్ కమిషన్ ఎంత తీసుకుంటాడు? ఇవన్నీ కూడా ఆలోచించకుండా అధికారులు టెండర్లు ఒకే చేయటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఒక కార్మికునికి కనీసం 700 రూపాయలు తగ్గకుండా ఒకరోజు వేతనం చెల్లించాలని కార్మిక చట్టాలు పేర్కొంటుంటే, అధికారులు ఏ విధంగా తక్కువ వేతనం ఆమోదిస్తారని ప్రశ్నించారు. అధికారులే కార్మిక చట్టాలను గౌరవించకపోతే చట్టాలు ఎలా అమలు అవుతాయని అన్నారు. తక్షణం రు,, 450/-ల టెండర్ను రద్దుచేసి కార్మిక చట్టాలకి అనుగుణంగా కొత్త టెండర్ కి అవకాశం కల్పించాలని ఆయన ఈ సందర్భంగా కమిషనర్ ని కోరారు.కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు జక్కి జేమ్స్, కోశాధికారితో తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్యామల విద్యాసేవలు నిరుపమానం




**విజయవాడ పశ్చిమ అక్టోబరు 3: (వార్త ప్రభ ప్రతినిధి)** పట్టుదల, అంకితభావం, సేవాగుణం అన్నీ కలిసిన విద్యామూర్తి డాక్టర్ పి.శ్యామల అని, విద్యారంగానికి ఆమె అందిస్తున్న సేవలు నిరుపమానమని పలువురు వక్తలు కొనియాడారు. లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్శిటీ నుంచి ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ అందుకున్న సందర్భంగా దోకిపర్తి ఉపేంద్ర హై స్కూల్ ప్రిన్సిపాల్ పి.శ్యామలను హిందూ హై స్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కె.బి.ఎన్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనరల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య మాట్లాడుతూ విద్యారంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న అధునాతన మార్పులకు అనుగుణంగా తన విద్యా సంస్థను తీర్చిదిద్దుతూ, విద్యార్థులను భావిజీవితానికి సన్నద్ధులను చేయటంలో శ్యామల క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. దోకిపర్తి ఉపేంద్ర హై స్కూల్ ఇన్చార్జి సెక్రటరీ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ సమర్థమైన నాయకత్వం, ఉత్తమ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా శ్యామలను కొనియాడారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య, కోశాధికారి గోళ్ళ బాబా విజయ్ కుమార్, కెబిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తదితరులు శ్యామల చేసిన సేవలను ప్రశంసిస్తూ ప్రసంగించారు.

## ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలచే ఉచిత ఆయుర్వేద మెగా వైద్య శిబిరం





**విజయవాడ, అక్టోబర్ 3 :(వార్తా ప్రభ ప్రతినిధి):** సీతారాంపురం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయము నందు, డా. నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల మరియు డా. ఆచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వారిచే సంయుక్తంగా ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరమును శనివారం, అక్టోబర్ 3 వ తేదీన ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించినారు. ఇందులో 219 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. వైద్య శిబిరమునందు ఆయుర్వేద వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ లు డా. వి భారతి, డా. జె మహిత ల నేతృత్వంలో పీ జీ వైద్య విద్యార్థులు, మరియు హౌస్ సర్జన్ ఉచిత వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించారు. ఆయుర్వేదంతో ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని, ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేద చిట్కాలు ఆచారనీయమని ఆయుర్వేద వైద్యులు పేర్కొన్నారు.ఈ వైద్య శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షల తో పాటు సలహాలు, సూచనలు, అహార, జీవన శైలి మార్గదర్శకాలు, ఆరోగ్య అవగాహన, సంక్షేమ చిట్కాలను వైద్యులు వివరించారు.శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్టీ ఊటుకూరి రామకృష్ణారావు,సభ్యులు వి మల్లికార్జునరావు (ధూర్జటి యాడ్స్), ఆలయ అర్చకులు పార్థసారథి తదితరులు వైద్య శిబిరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఓం శ్రీ శివ పార్వతి పుత్ర సేవా సమితి ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నదానం





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 3 :(వార్త ప్రభ ప్రతినిధి)**ఓం శ్రీ శివ పార్వతి పుత్ర సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక గొల్లపాలెం గట్టు, పొట్టి శ్రీరాములు కళాశాల సమీపంలో వినాయక చవితి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక అన్నసంతర్పణ కార్యక్రమానికి మాజీ మంత్రివర్యులు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు.?ఈ సందర్భంగా తొలుత గణనాథుడిని దర్శించుకున్న వెలంపల్లి శ్రీనివాసరావు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నియోజకవర్గ ప్రజలందరిపై విఘ్నేశ్వరుని ఆశీస్సులు మెండుగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.?అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని భక్తులకు స్వామివారి అన్నప్రసాదాన్ని వడ్డించారు. భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తూ, పేద ప్రజలకు మరియు భక్తులకు అన్నదానం చేయడం ఎంతో అభినందనీయమని ఈ సందర్భంగా నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.

## దోమల నివారణకు విస్తృతంగా యాంటీ లార్వా ఆపరేషన్లు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 3 :(వార్త ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలో ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా దోమల నియంత్రణ చర్యలను విస్తృతంగా చేపడుతున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ తెలిపారు.కమిషనర్ ఆదేశాల మేరకు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ నిర్మల గ్లోరీ సూచనలతో బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం కండ్రిక, గాంధీనగర్, అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. దోమల వృద్ధికి అనుకూలంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, లార్వా నివారణకు అవసరమైన చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ మాట్లాడుతూ, నగరంలో డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను నియంత్రించేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా దోమల నివాస ప్రాంతాల గుర్తింపు, ఫాగింగ్, సైడ్ కాలువల్లో పూడికల తొలగింపు, కాలువల్లో ఎంఎల్ ఆయిల్ స్ప్రేయింగ్ వంటి కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు.

## రికవరీ చేసిన గొలుసు బాధితురాలికి అందించిన పోలీసులు



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 03(వార్తా ప్రభ ప్రతినిధి):**ఈ నెల 25 తేదీన వెంకటేశ్వరరావు కు చెందిన బంగారపు నాన్ తాడు,తాళిబొట్టు కలిపి ఉన్న గొలుసును కొండపల్లి లో గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు . బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు తో ఇబ్రహీంపట్నం సీఐ ఏ సుబ్రహ్మణ్యం ఆదేశాలతో క్రైమ్ ఎస్ఐ సేనాపతి శ్రీనివాసరావు, సిబ్బంది సమగ్ర విచారణ చేసి దొంగను పట్టుకున్నారు. చోరీకి గురైన బంగారపు నాన్తాడును రికవరీ చేసి బాధితురాలికి శనివారం సీఐ అందజేశారు. ఇబ్రహీంపట్నం కొండపల్లి పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న చోరీల పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఇబ్రహీంపట్నం పోలీస్ క్రైం విభాగం సమర్థవంతంగా పని చేస్తోందని ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం తెలిపారు. క్రైమ్ డిపార్ట్మెంట్ ఎస్ ఐ సేనాపతి బృందాన్ని అభినందించారు.

## తాతయ్య మేటి మాటలు

అనుకున్న లక్ష్యాన్ని
చేరుకో చేరుకో
ముందున్న కష్టాన్ని
ఇష్టంగా మార్చుకో
కాసింత త్యాగాన్ని
చాటుకో చాటుకో
ఒక్కింత స్వార్థాన్ని
వదులుకో వదులుకో
ఘనమైన నమ్మకాన్ని
సదా నిలబెట్టుకో
వచ్చిన అవకాశాన్ని
వాడుకో వాడుకో
కళ్లెదుట ఘోరాన్ని
అడ్డుకో అడ్డుకో
సాధనతో విజయాన్ని
అందుకో అందుకో



-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

## నేతాజీ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలపై జిహెచ్ఎంసి కమిషనర్ కి వినతి పత్రం.

**అందజేసిన బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ బృందం**



హైదరాబాద్, అక్టోబర్ 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఒకరోజు ఒక వార్డ్ కార్యక్రమంలో భాగంగా నల్లగండ్ల 256 వార్డులోని గుల్మోహర్ కాలనీలో సమీక్షా సమావేశంలో నేతాజీ నగర్ కాలనీ లోని సమస్యలపై జిహెచ్ఎంసి కమిషనర్ కి వినతి పత్రం నేతాజీ నగర్ కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ అందచేశారు. నేతాజీ నగర్ కాలనీ లో నెలకొన్న సమస్యలను ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు సిసి రోడ్లు వీధిలైట్లు శానిటేషన్ వర్క్ మరియు కాలనీలో నెలకొన్న మౌలిక వసతులపై కాలనీ అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్ కమీషనర్, డిప్యూటీ కమిషనర్ జిహెచ్ఎంసి సిబ్బంది కి కాలనీలో నెలకొన్న సమస్యలు వివరించడం జరిగింది . వారు సానుకూలంగా స్పందిస్తూ తొందర్లో ఈ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పడం చాలా సంతోషదాయకం అని భేరి రామచందర్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఒకరోజు ఒక వార్డు లాంటి కార్యక్రమాలు చేపడుతూ ప్రతి కాలనీకి అధికారులు వచ్చి కాలనీలో ఉన్న సమస్యలు తెలుసుకుని ఆ సమస్యలను పరిష్కరించుతున్నారంటే అధికారులకు ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపిన వారిలో కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ తో పాటు కే నరసింహ యాదవ్, అన్నదొర,దశరథ్ నాయక్, గణేష్ నాయక్, జోషి రాఘవేంద్ర శర్మ, మణికంఠ, ప్రసాద్, మరియు కాలనీ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

## కానమేట్ లోని ప్రభుత్వ భూమి అన్యకాంతం కాకుండా కాపాడండి

**- సిపిఐ డిమాండ్**



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 3 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి మండల పరిధి కానమెట్ సర్వేనెంబర్ 41 /13 లోని ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సీపీఐ శేరిలింగంపల్లి నియోజకవర్గ కమిటీ డిమాండ్ చేసింది. రెండు ఎకరాల ఐదు గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు ఆరోపించారు.భూమిని తక్షణమే సర్వే చేసి, ఎంత మేర కబ్జాకు గురైందో నిర్ధారించాలని కోరారు. కబ్జాకు ప్రయత్నించిన వారిపై భూకబ్జా కేసులు నమోదు చేసి, ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ఫెన్సింగ్ వేసి రక్షణ కల్పించడంతోపాటు అవసరమైతే హైడ్రా సహకారం తీసుకోవాలని కోరారు.రెండు రోజుల్లో అధికారులు చర్యలు తీసుకోకపోతే శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సీపీఐ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని పానుగంటి పర్వతాలు హెచ్చరించారు.ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు టి.రామకృష్ణ, కే. చందు యాదవ్, మండల కార్యదర్శి కే. వెంకటస్వామి,డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నారాయణ,మండల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బౌరంపేట్‌లో రోడ్డు ప్రమాదం

**చికిత్స పొందుతూ వ్యక్తి మృతి, కేసు నమోదు**

**దుండిగల్, అక్టోబర్ 3, (వార్తాప్రభ) :** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా గండిమైసమ్మ--దుండిగల్ మండలం బౌరంపేట్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉదుతూరి వెంకట్ రెడ్డి (38) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గుంటూరు జిల్లా వెల్దుర్తి మండలానికి చెందిన వెంకట్ రెడ్డి శంభీపూర్‌లో నివాసముంటూ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం పగలు ఆయన ద్విచక్రవాహనంపై శంభీపూర్ నుంచి బౌరంపేట్ వైపు వెళ్తుండగా, సుకృతి హోమ్స్ సమీపంలోకి రాగానే బౌరంపేట్ వైపు నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా దూసుకొచ్చిన కారు (టీఎస్ 08 టీఏ 3447) ఆయన వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకట్ రెడ్డి తల, కుడి కాలు సహా శరీర భాగాలకు తీవ్ర రక్తస్రావ గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ రాత్రి వేళ పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయారు. మృతుడి భార్య ఉదుతూరి పద్మజ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు పోలీసులు రాత్రి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## ఆగిరిపల్లి పాఠశాల విద్యార్థులు క్రీడాకారుల సత్తా

**అండర్--14 హ్యాండ్‌బాల్‌లో ముగ్గురికి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత**



**ఆగిరిపల్లి, అక్టోబర్ 3 (వార్తా ప్రభ ప్రతినిధి):** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్--2026 జిల్లా స్థాయి అండర్--14 హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ప్రతిభ చాటారు. శనివారం విజయవాడ పటమటలోని కేబీసీ జడ్పీ బాయ్స్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఆగిరిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి సుమారు 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు.వీరిలో కె. లికేష్, ఎన్. నందిని, ఎస్‌కే. జోయా అన్వర్ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించి జిల్లా స్థాయి పోటీలకు సిద్ధం చేసిన పీడీ శివ నాగేంద్రరావు, సుగుణరావు, సాయి కిషోర్‌లను గ్రామస్తులు, విద్యా కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.రాష్ట్రస్థాయి పోటీల్లోనూ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి విజయం సాధించి ఆగిరిపల్లి మండలానికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# డాక్టర్ కిరణ్ కుమార్ జన్మదిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా వడ్డేపల్లి రాజేశ్వరరావు

**పలు సేవా కార్యక్రమాలు**





**కూకట్ పల్లి, అక్టోబర్ 3(వార్తాప్రభ):**బాలానగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు డాక్టర్ కిరణ్ కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బాలానగర్ డివిజన్ బీజేపీ కార్యాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ కిరణ్ కుమార్ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు కిరణ్ కుమార్ ని శాలువాతో సన్మానించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు చేతుల మీదుగా ద్విచక్ర వాహనదారులకు ప్రాణరక్షణగా భావించే హెల్మెట్లను వాహనదారులకు పంపిణీ చేశారు.అన్ని దానాలలో అన్నదానం మిన్న అనే సదుద్దేశంతో తన జన్మదినాన్ని సేవా కార్యక్రమంగా నిర్వహించాలనే ఉద్దేశంతో డాక్టర్ కిరణ్ కుమార్ పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. ఇటీవల గణేష్ నిమజ్జనం సందర్భంగా ఐడీఎల్ చెరువు కట్టపై వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని, తన పుట్టినరోజు సందర్భంగా నలుగురికైనా భోజనం పెట్టాలనే మంచి ఆలోచనతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు డాక్టర్ కిరణ్ కుమార్ ని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని, మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించాలని ఆకాంక్షించారు.డాక్టర్ కిరణ్ కుమార్ కి హృదయపూర్వక ఆశీస్సులు అందజేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# విజయవాడ ఉత్సవ్ ప్రచారంలో భాగంగా అదరగొట్టిన ఫ్లాష్‌మాబ్‌లు

**ప్రధాన కూడళ్లలో కళాకారుల నృత్య ప్రదర్శనలు..**

**ఉత్సాహంగా తిలకించిన నగరవాసులు**

**ఫ్లాష్ మాబ్స్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నూర్ భాషా కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 3 :(వార్త ప్రభ ప్రతినిధి)** సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పర్యాటక శాఖ సహకారంతో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్కు విస్తృత ప్రచారం కల్పించేందుకు నగరంలోని ప్రధాన కూడళ్లలో నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని చిట్టినగర్ సెంటర్, భవానిపురం శివాలయం సెంటర్, కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్, కలరా హాస్పిటల్ సెంటర్ వద్ద ప్రత్యేకంగా ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.ప్రధాన కూడళ్లలో ఒక్కసారిగా సంగీతం ప్రారంభం కావడంతో యువ కళాకారులు ఉత్సాహభరితమైన నృత్య ప్రదర్శనలను ప్రారంభించారు. సమన్వయంతో కూడిన నృత్య కదలికలు, ఆకట్టుకునే కొరియోగ్రఫీతో కళాకారులు చేసిన ప్రదర్శనలు స్థానికులు, ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పలువురు ప్రజలు తమ మొబైల్ ఫోన్లలో ప్రదర్శనలను చిత్రీకరిస్తూ ఆసక్తిగా తిలకించారు.ఫ్లాష్‌మాబ్‌లలో విజయవాడ నగర కళా, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే అంశాలతో పాటు విజయవాడ ఉత్సవ్ స్ఫూర్తిని చాటిచెప్పే నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువతలో ఉత్సవంపై ఆసక్తిని పెంచడంతో పాటు, నగరవాసులను విజయవాడ ఉత్సవ్‌లో భాగస్వాములను చేయడం, ఉత్సవ విశేషాలను వినూత్న రీతిలో ప్రజల్లోకి తీసుకెళ్లడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.చిట్టినగర్, భవానిపురం, కాళేశ్వరరావు మార్కెట్, కలరా హాస్పిటల్ సెంటర్లలో నిర్వహించిన ఫ్లాష్‌మాబ్‌లు విజయవాడ ఉత్సవ్ సందేశాన్ని నేరుగా ప్రజల మధ్యకు తీసుకెళ్లాయి. సంప్రదాయ ప్రచార విధానాలకు భిన్నంగా సంగీతం, నృత్యం, యువత ఉత్సాహంతో నిర్వహించిన ఈ కార్యక్రమాలు నగరంలో ఉత్సవ వాతావరణాన్ని మరింత పెంచాయి.విజయవాడ నగరానికి ఉన్న చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రత్యేకతలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, విజయవాడ ఉత్సవ్‌ను నగర ప్రజలందరి ఉత్సవంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఇటువంటి వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.విజయవాడ ప్రజలు, కళాకారులు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ప్రతినిధులు కోరారు.ఈ కార్యక్రమంలో ఫతావుల్లా, ఆషా, ఏదుపాటి రామయ్య గుర్రంకొండ పాల మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లీబిడ్డల సంక్షేమానికి అంగన్వాడీ చేయూత

**పోషకాహారం,సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు**



**కాకినాడ రూరల్/కరప, అక్టోబర్ 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి పథకాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెనుగుదురు కూటమి నాయకులు, మండల అంబేద్కర్ యువజన సేవా సంఘం మాజీ అధ్యక్షులు పులపకూర శుభ మహేష్ పిలుపునిచ్చారు. పెనుగుదురు అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన అంగన్వాడీ ఉత్సవం--సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నారులు, గర్భిణులు,బాలింతల ఆరోగ్యంపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయని శుభ మహేష్ తెలిపారు. అంగన్‌వ్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, సంక్షేమ పథకాలు, పోషకాహారం ప్రాధాన్యతపై అంగన్‌వ్వాడీ కార్యకర్త ఊబా మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించారు. కాకినాడ రూరల్ ప్రాజెక్టు, కరప మండలం గొర్రిపూడి సెక్షన్ పరిధిలోని పెద్దాపురంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో ఆదేశాల మేరకు 'అంగన్‌వ్వాడీ పోషణ్ ఉత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఎదుగుదలకు పోషకాహారం ప్రాధాన్యత, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న వివిధ సేవలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. పెనుగుదురు కార్యక్రమంలో అంగన్‌వ్వాడీ కార్యకర్త ఊబా మహాలక్ష్మి, ఆశా కార్యకర్త పులపకూర కృష్ణకుమారి,ఆయా అతం సావిత్రి, తల్లులు అనిశెట్టి బాల,వేమనపూడి దేవిలను సత్కరించారు. సూపర్‌వైజర్ కే. విజయకుమారి, కే. శ్రీదేవి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. పెద్దాపురంపాడు కార్యక్రమంలో అంగన్‌వ్వాడీ కార్యకర్త జె. వెంకటలక్ష్మి, హెల్పర్ కె. లక్ష్మిని సత్కరించారు. నీటి సంఘం అధ్యక్షుడు యాళ్ల శ్రీనివాసరావు, జనసేన నాయకుడు యాళ్ల శంకర్ ధరరావు,వార్డు సభ్యురాలు మేడిశెట్టి నాగమణి, ఎంపీటీసీ పబ్బినీడి పద్మావతి ప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ గొల్లపల్లి ధనలక్ష్మి సోమశంకరం, కూటమి నాయకులు పోల్నాటి శ్రీనివాస్, పబ్బినీడి ప్రదీప్, ఏఎన్ఎం,ఆశా కార్యకర్తలు, చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు.

# జగ్గయ్యపేట మున్సిపాలిటీలో సమస్యలపై ప్రజల ఆగ్రహం

**నిధులు ఉన్నా అభివృద్ధి పనుల్లో జాప్యం.. పారిశుధ్యం, వీధి దీపాలు, కుక్కల బెడదపై ఫిర్యాదులు**




**జగ్గయ్యపేట, అక్టోబర్ 3 (వార్తప్రభ):** జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, రహదారులు, వీధి కుక్కల నియంత్రణ వంటి అంశాల్లో మరింత శ్రద్ధ అవసరమని ప్రజలు కోరుతున్నారు.

**మీడియాకు సమాచారం ఇవ్వడంలోనూ నిర్లక్ష్యమేనా?** మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, టెండర్లు, పనుల పురోగతి, ఖర్చు చేస్తున్న నిధులు తదితర వివరాలను ప్రజలకు, మీడియాకు ఎప్పటికప్పుడు తెలియజేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. అయితే సంబంధిత సమాచారం సకాలంలో అందకపోవడంతో మున్సిపాలిటీలో ఏం జరుగుతుందనే విషయంలో ప్రజల్లో అయోమయం నెలకొంటోందని పలువురు పేర్కొంటున్నారు.ప్రజాధనంతో చేపడుతున్న పనుల వివరాలు పారదర్శకంగా వెల్లడించాలని, ఏ పని కోసం ఎంత నిధులు మంజూరయ్యాయి, ఎంత ఖర్చయ్యాయి, పని పూర్తయిందా లేదా అనే వివరాలను బహిరంగంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

**నిధులు ఉన్నా అభివృద్ధి ఎక్కడ?** మున్సిపాలిటీకి వివిధ మార్గాల ద్వారా నిధులు అందుతున్నప్పటికీ పట్టణంలోని అనేక ప్రాంతాల్లో మౌలిక వసతుల సమస్యలు కొనసాగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి ప్రాథమిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.కొన్ని అభివృద్ధి పనులు ప్రారంభించిన తర్వాత పూర్తి కాకుండా మధ్యలోనే నిలిచిపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు అంటున్నారు. నిర్మాణ పనులు ప్రారంభించే ముందు నిధులు, బిల్లుల చెల్లింపు, పనుల గడువు వంటి అంశాలను స్పష్టంగా నిర్ణయించి, పనులు పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని కోరుతున్నారు.

**పారిశుధ్య నిర్వహణపై ఫిర్యాదులు** పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడం, కాలువల్లో పూడిక తొలగింపులో జాప్యం, పరిసరాల పరిశుభ్రతపై తగినంత పర్యవేక్షణ లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.పారిశుధ్య సిబ్బంది హాజరు, వాహనాల వినియోగం, చెత్త సేకరణ, పారిశుధ్య పనుల నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధులపై కూడా సమానంగా దృష్టి పెట్టాలని అంటున్నారు.

**వీధి దీపాలు లేక రాత్రివేళ ఇబ్బందులు** పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు పనిచేయకపోవడం లేదా అవసరమైన ప్రాంతాల్లో కొత్త లైట్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల రాత్రివేళ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.వీధి దీపాలపై ప్రత్యేకంగా సర్వే నిర్వహించి, పనిచేయని లైట్లను వెంటనే మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన చోట కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు రాత్రివేళ ప్రయాణించే ప్రాంతాల్లో వెలుతురు సమస్యను ప్రాధాన్యతగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

**వీధి కుక్కల బెడద.. ప్రజలకు భయం** జగ్గయ్యపేట పట్టణంలోని పలు రోడ్లు, కాలనీల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనదారులను వెంబడించడం, చిన్నారులు మరియు వృద్ధులపై దూసుకెళ్లడం వంటి ఘటనలు జరుగుతున్నాయని వారు అంటున్నారు. కుక్కల నియంత్రణకు సంబంధించి నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టి, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

## అంగన్వాడీ కేంద్రం 2 నందు పోషణ మాస ఉత్సవం



**పెనుగంచిప్రోలు - అక్టోబర్ 3( వార్త ప్రభ )** ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు ప్రాజెక్టు ఐసిడిఎస్ సిడిపిఓ సత్యవతి ఆదేశాల మేరకు సూపర్వైజర్ రజనీ జ్వాలా ఆధ్వర్యంలో శనివారం పెనుగంచిప్రోలు అంగన్వాడి కేంద్రం. 2 నందు పోషణ మాస ఉత్సవంలో భాగంగా అంగన్వాడీ ఉత్సవం సేవా సంకల్ప కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో గర్భవతులు బాలింతలకు అంగన్వాడీలో ఇచ్చే పౌష్టికాహారం గురించి వివరించడం జరిగింది 7నుండి 3 సంవత్సరాలు పిల్లలు తల్లులకు బాలామృతం యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించడం జరిగింది ఆకుకూరలు ములగాకు రాగి జావా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని లబ్ధిదారులకు వివరించడం జరిగింది. అదేవిధంగా ఈరోజుజరిగింది ఈ కార్యక్రమంలో గర్భవతులు బాలింతలు తల్లులు అంగన్వాడి కార్యకర్తలు సహాయకులు పాల్గొన్నారు...

## టూవీలర్‌ను ఢీకొట్టిన కారు

**వాచ్‌మెన్‌కు తీవ్ర గాయాలు, కాలు విరిగి ఆసుపత్రిపాలు**



**జీడిమెట్ల, అక్టోబర్ 3, (వార్తాప్రభ) :** జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో అలిసరి శ్రావణ్ కుమార్ (38) తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో ఆయన కాలు విరిగిపోవడంతో స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు.

**దిక్కున్న చోట చెప్పుకోమంటూ కారు డ్రైవర్ బెదిరింపులు**జనగాం జిల్లాకు చెందిన శ్రావణ్ కుమార్ బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి జీడిమెట్లలోని ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న శ్రావణ్ కుమార్ తీవ్ర గాయాలపాలై మంచాన పడటంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత కారు యజమాన్యం కనీస మానవత్వం చూపించకుండా బాధితులపై దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం. అధికారులు తనకు తెలుసని, దిక్కున్న చోట చెప్పుకోవాలంటూ బెదిరింపులకు దిగినట్లు బాధితులు వాపోయారు. ఈ ఘటనపై బాధితుడి కుటుంబ సభ్యులు జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. నిరుపేద కుటుంబానికి న్యాయం చేయాలని, నిర్లక్ష్యంగా వాహనం నడిపి బెదిరింపులకు పాల్పడిన కారు డ్రైవర్‌పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిరుపేద కుటుంబాలకు ఎంతగానో మేలు జరుగుతుంది.

**ఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్**



**జవహర్ నగర్, అక్టోబర్ 03(వార్తా ప్రభ):**కీసర సర్కిల్ జవహార్ నగర్ కు చెందిన జంగం సారమ్మ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా, మాజీ మంత్రి మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.36,000 చెక్కును జవహర్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాషావోని కొండల్ ముదిరాజ్, జంగం సారమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా కొండల్ ముదిరాజ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వారికి అవసరమైన సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తానని కొండల్ ముదిరాజ్ తెలిపారు.ప్రజల కష్టాల్లో తోడుగా...ప్రతి కుటుంబానికి అండగా...ప్రజా సంక్షేమమే లక్ష్యంగా...ప్రతి ఒక్కరికీ అవసరమైన సమయంలో అండగా నిలవడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 03(వార్తా ప్రభ ప్రతినిధి)** మండల పరిధిలోని తుమ్మలపాలెం పెట్రోల్ బంక్ సమీపంలో హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందారు. బైక్ ను లారీ ఢీ కొట్టడంతో నందిగామకు చెందిన మొండితోక సుందరావు (42) సంఘటన స్థలంలోని మృతి చెందాడు. విజయవాడ నుండి నందిగామ వైపు వెళ్తుండగా వేగంగా దూసుకొచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టడంతో బైక్ నడుపుతున్న వ్యక్తి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.హెల్మెట్ ధరించినప్పటికీ.. లారీ ఢీకొట్టిన వేగానికి తలకు తీవ్ర గాయం అవ్వడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ లు దర్యాప్తు చేస్తున్నారు.

## నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తకు ఘన సన్మానం



**మంగళగిరి:అక్టోబర్ 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం ఈమని గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లి ధర్మరత్నం ఆధ్వర్యంలో నియోజకవర్గ సమన్వయకర్త బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డిని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతం, స్థానికంగా పార్టీ కార్యకలాపాలపై నాయకులు చర్చించారు. కార్యక్రమంలో రాచకొండ శ్రీనివాసరావు, కస్తాల శ్రీనివాసరావు, గండికోట శ్రీనివాసరావు, దావీదు, విజయ్, సల్మాన్, లోకేష్, చెన్నయ్య, వీరయ్య, రమేష్, సందీప్, రామకృష్ణతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## న్యాయదేవత సన్నిధిలో గణనాథుడి సందడి

**- ఓల్డ్ కోర్టు బిల్డింగ్ వద్ద 5వేల మందికి అన్నదానం**



**గుడివాడ,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** స్థానిక ఆర్డీవో ఆఫీసు రోడ్డులోని పాత కోర్టు భవనం వద్ద శ్రీ విఘ్నేశ్వరుడి నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా ముగిశాయి. నవరాత్రులు ముగింపు సందర్భంగా పాత కోర్టు ప్రాంగణంలో నిర్వాహకులు భారీ అన్న సమారాధనను ఏర్పాటు చేశారు. న్యాయదేవత సన్నిధిలో, వినాయకుడి సాక్షిగా జరిగిన ఈ అన్నదాన మహోత్సవంలో న్యాయవాదులు, గుమస్తాలు, కోర్టు సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 5,000 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలు, భజనలు, ప్రత్యేక అభిషేకాలతో గణనాథుడిని ఆరాధించిన అనంతరం, ఈ అన్న సమారాధనతో ఉత్సవాలకు పరిపూర్ణత చేకూరిందని నిర్వాహకులు తెలిపారు. విఘ్నాలను తొలగించే వినాయకుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, న్యాయవ్యవస్థ, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ధర్మమార్గంలో నడవాలని ఆకాంక్షిస్తూ ఈ అన్నదానాన్ని నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు.

## జయంతి వేడుకల్లో సేవా సంబరం

## వృద్ధులకు సత్కారం, బాధితుడికి అండ..



**కలిదిండి,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** కలిదిండి మార్కెట్ యార్డు ప్రాంగణంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ కలిదిండి శాఖ అధ్యక్షులు పోకల దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాంధీ, శాస్త్రీల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ శాంతియుత పోరాటం, శాస్త్రి జీవించిన నిరాడంబర జీవితం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ సమాజ సేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులు నూకల శ్యామలరావు గుప్తా మాట్లాడుతూ నిస్వార్థ సేవ, సత్యమే వారికి నిజమైన నివాళి అని అన్నారు. చైర్మన్ పెట్టేటి వివేకానంద గురుస్వామి వృద్ధులను గౌరవించడం సంస్థ కర్తవ్యమని పేర్కొన్నారు. అనంతరం ఐదుగురు వృద్ధులను శాలువాలతో సత్కరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కరరావుపేటకు చెందిన దొంగ సత్యనారాయణకు వైద్య సాయంగా రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, డైరెక్టర్లు, సుమారు 50మంది సేవాభిలాషులు పాల్గొన్నారు.

## గుడివాడలో మద్యం షాపులకు భారీ డిమాండ్

**–ఒక్కో లైసెన్స్ రూ. 71 లక్షలు !**



**గుడివాడ,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** 2026–27 సంవత్సరానికి గుడివాడ ఎక్సైజ్ పరిధిలో మద్యం షాపుల లైసెన్సుల కేటాయింపునకు సంబంధించి ఎక్సైజ్ శాఖ కీలక వివరాలను వెల్లడించింది. శనివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఎస్ఐ హేమ సుస్మితతో కలసి సిఐ వెంకటరమణ మాట్లాడుతూ.. గుడివాడ మున్సిపాలిటీ, గుడివాడ రూరల్, పామర్రు, గుడ్లవల్లేరు మండలాల పరిధిలోని 8 ఏ4 షాపులకు లైసెన్స్ ఫీజులను సీఐ వెంకటరమణ ప్రకటించారు. గుడివాడ మున్సిపాలిటీ పరిధిలోని కెఆర్ఎస్/49, కెఆర్ఎస్/51 షాపులకు ఒక్కో దానికి రూ.71.50 లక్షలు, మిగిలిన 6 షాపులకు ఒక్కో దానికి రూ.60.50 లక్షలు చొప్పున ఫీజు నిర్ణయించారు.

షాపుల వివరాలు :

- కెఆర్ఎస్/49 – గుడివాడ మున్సిపాలిటీ – రూ.71.50 లక్షలు
- కెఆర్ఎస్/51 – గుడివాడ మున్సిపాలిటీ – రూ.71.50 లక్షలు
- కెఆర్ఎస్/54 – గుడివాడ రూరల్ – రూ.60.50 లక్షలు
- కెఆర్ఎస్/55 – పామర్రు మండలం – రూ.60.50 లక్షలు
- కెఆర్ఎస్/58 – పామర్రు మండలం – రూ.60.50 లక్షలు
- కెఆర్ఎస్/60 – గుడ్లవల్లేరు మండలం – రూ.60.50 లక్షలు
- కెఆర్ఎస్/62 – గుడ్లవల్లేరు మండలం – రూ.60.50 లక్షలు
- కెఆర్ఎస్/64 – గుడ్లవల్లేరు మండలం – రూ.60.50 లక్షలు

దరఖాస్తుల స్వీకరణకు అక్టోబర్ 6, 2026 మధ్యాహ్నం 12 గంటల వరకు గడువు ఉండగా, అక్టోబర్ 8, 2026 ఉదయం 8 గంటలకు లాటరీ/డ్రా విధానంలో షాపుల కేటాయింపు జరుగుతుంది. కేటాయించే లైసెన్సులు 30 సెప్టెంబర్ 2027 వరకు చెల్లుబాటులో ఉంటాయన్నారు.

## ఆరుద్ర సందర్భంగా ముక్తేశ్వరుడికి విశేష పూజలు



**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం పెరికీడు గ్రామంలోని శ్రీ ముక్తికాంతా సమేత శ్రీ ముక్తేశ్వర స్వామివారి జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా శనివారం ఆలయంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పళ్లరసాలతో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అభిషేక కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదంతో పాటు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కుందుర్తి సీతారామయ్య, శ్యామ్, మహేష్, ఆలయ కమిటీ సభ్యులు నక్కా బాబు, నండూరి సత్య వెంకటేశ్వర శర్మ, పుట్టి కోటేశ్వరరావు, వీర్రాజు, పట్టి వేణు, నాగరాజు, వడ్డి విజయ్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ చరిత్రలో కీలక మలుపు..

**● 6 గ్రామాల విలీనానికి ముహూర్తం ఖరారు.. ● ఆర్డీఓ కార్యాలయంలో కీలక సమావేశం**



**గుడివాడ,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** గుడివాడ పురపాలక సంఘంలో 6 గ్రామ పంచాయతీల విలీన ప్రక్రియకు తొలి అడుగు పడింది. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జీ. బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. లింగవరం, వలివర్తిపాడు, మల్లయ్యపాలెం, బొమ్ములూరు, బిళ్లపాడు, భూషణగుళ్ల గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేసే అంశంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. గుడివాడ, పెదపారుపూడి మండల తహసీల్దార్లు, ఎండీవోలు, ఆరు పంచాయతీల అధికారులు పాల్గొన్నారు.

**ఆర్డీఓ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ...** విలీనంపై న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రక్రియ ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ప్రతి పంచాయతీకి సంబంధించిన రికార్డులు, ఆస్తులు, ఉద్యోగులు, బకాయిలు, పెండింగ్ బిల్లులపై పూర్తి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. విలీనం తర్వాత పరిపాలన మొత్తం మున్సిపల్ కమిషనర్ పరిధిలోకి వస్తుందని, ఉద్యోగుల విభజన నిబంధనల ప్రకారం జరుగుతుందని తెలిపారు.

**మున్సిపల్ కమిషనర్ మనోహర్ మాట్లాడుతూ...** ఉద్యోగులు, సిబ్బంది వివరాలు, ఆస్తుల రికార్డులు సమగ్రంగా సిద్ధం చేయాలని సూచించారు.

**ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ...** విలీన ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పెండింగ్ అభివృద్ధి పనులను ఏ, బి, సి ప్రాధాన్యతలుగా విభజించి నివేదిక సిద్ధం చేయాలని, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. విలీనం కేవలం పరిపాలనా మార్పు కాదు, ప్రజలకు మెరుగైన సేవలు, మెరుగైన వసతులు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. సమావేశంలో తహసీల్దార్లు ప్రసాద్, శ్రీను నాయక్, ఎండీవోలు శ్రీనివాస్, మల్లీశ్వరి, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సేవలకు అభినందన.. సిబ్బందికి సన్మానం



**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం పెరికీడు గ్రామంలోని 3వ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ ఉత్సవ్, సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7 వరకు నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 7 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, అంగన్వాడీ కేంద్రంలో నమోదులు, మధ్యాహ్న భోజనం, ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం, చిన్నారుల ఎత్తు, బరువు కొలతలు, పోషణ స్థితి, మెనూ వివరాలను వివరించారు. మెనూ ప్రకారం చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించే విధానాన్ని తల్లులకు తెలియజేశారు. అంగన్వాడీ కార్యకర్త గొట్టాపు రజిని, సహాయకురాలు ఏ. సాయికుమారి చిన్నారులను శ్రద్ధగా చూసుకుంటూ అందిస్తున్న సేవలను అభినందిస్తూ పూర్వ విద్యార్థుల తల్లులు, ప్రస్తుత చిన్నారుల తల్లులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయురాలు అయినాల విజయలక్ష్మి, ఏఎంసీ కమిటీ సభ్యులు ఎం. లక్ష్మి పార్వతి, ఎస్. సంధ్య, కే. చాముండేశ్వరి, ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయురాలు పి. లీల సుగుణ, ఆశా కార్యకర్త ఎం. సుబ్రహ్మణ్యేశ్వరి, అంగన్వాడీ పిల్లల తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి అండ

**● 32 మంది లబ్ధిదారులకు రూ.16 లక్షల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ**



**నందిగామ,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** ప్రజల ఆరోగ్య, సంక్షేమాలను పరిరక్షించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. స్థానిక కాకాని నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం పట్టణానికి చెందిన 32 మంది లబ్ధిదారులకు రూ.16 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను నియోజకవర్గ పరిశీలకులు తాళ్ల వెంకటేష్ యాదవ్ మరియు కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నేరుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సంక్షేమం, ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల యోగక్షేమాలను పరిరక్షిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సౌమ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నందిగామ మార్కెట్ యార్డుకు రూ.42 లక్షల నిధులు మంజూరు

**● ఎఫ్ఐసీ భవనం మరమ్మతులకు రూ.40 లక్షలు,ఆర్వో ప్లాంట్ ఇన్సులేషన్‌కు రూ.2 లక్షలు**



**నందిగామ,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** మార్కెట్ యార్డులో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు మరో ముందడుగు పడింది. అందుబాటులో ఉన్న సేవింగ్స్ మార్కెట్ యార్డ్ నిధుల నుంచి ఎఫ్ఐసీ భవనం మెయింటెనెన్స్ అండ్ రిపేర్ పనులకు రూ.40 లక్షలు, మార్కెట్ యార్డులో ఆర్వో ప్లాంట్ ఇన్సులేషన్ పనులకు రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.42 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంజూరు చేసిన సాంక్షన్ పత్రాన్ని నందిగామ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అమ్మినేని జ్వాలా ప్రసాద్, మార్కెట్ యార్డ్ సెక్రటరీలు కలిసి శనివారం నందిగామలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్‌లో మౌలిక వసతులను మరింత మెరుగుపరిచి రైతులకు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే సౌమ్య పేర్కొన్నారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే





**పెనుగంచిప్రోలు,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలంలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులకు, పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య చేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య తెలిపారు. ఈ సందర్భంగా పెనుగంచిప్రోలు, ముండ్లపాడు, నవాబుపేట, తోటచర్ల గ్రామాల్లో నిర్మించనున్న పలు సీసీ రోడ్ల పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా దశలవారీగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ హోదాలలో ఉన్న కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా పూతబోయిన కరుణ్ కుమార్ జన్మదిన వేడుకలు



**కోడూరు,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** కోడూరు పీఏసీఎస్ చైర్పర్సన్, జనసేన పార్టీ నాయకులు పూతబోయిన కరుణ్ కుమార్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కరుణ్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సీఈవో బడే సురేష్‌బాబు, నాగబాబుతో పాటు పీఏసీఎస్ సిబ్బంది కరుణ్ కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## గుడివాడ ఆదిత్యకు మరో ఘనత

## స్వచ్ఛతా 5కె రన్‌లో టాప్ రన్నర్‌గా పవన్



**గుడివాడ,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** స్థానిక గుడివాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో మూడవ సంవత్సరం డాటా సైన్స్ చదువుతున్న ఎన్ఎస్–ఎస్ వాలంటీర్ తాళం పవన్ ఆదిత్య విజయవాడలో అమరావతి రన్నర్స్ స్వచ్ఛతాన్ నిర్వహించిన 5కె రన్ లో పాల్గొని, టాప్–25 రన్నర్లలో స్థానం సాధించాడు. ఈ సందర్భంగా నిర్వాహకులు అతనికి పతకాన్ని అందజేసి సత్కరించారు. ఈ విజయాన్ని పురస్కరించుకొని కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. రవీంద్ర బాబు పవన్ ఆదిత్యను అభినందించారు. విద్యార్థులు ఇలాంటి క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి. జె. సతీష్ చంద్ర పవన్ ఆదిత్యను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఫోక్సో చట్టం ,గంజాయి నిర్మూలన ,స్త్రీలపై అఘాయిత్యాల గురించి నిత్యం ప్రజల్లో అవేర్నెస్



**ఏలూరు జిల్లా,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామానికి కేటాయించిన జి ఎం ఎస్ కే సంధ్య తనదైన శైలిలో నిత్యం ప్రజలలో ఉంటూ స్వయంగా బ్యానర్లు తయారు చేసుకుని నిత్యం ప్రజల్లో తిరుగుతూ ఎక్కడ పదిమంది కనబడితే అక్కడ ఆగిపోయి ఫోక్సో చట్టం గురించి గంజాయి నిర్మూలన గురించి స్త్రీలపై అఘాయిత్యాల గురించి నిత్యం ప్రజల్లో ఎవర్నెస్ కలిగిస్తూ తనదైన శైలిలో ముందుకు వెళ్లడంతో అధికారులే కాకుండా గ్రామస్తులు కూడా ఆమె పనితీరును ప్రశంసిస్తున్నారు .అన్ని గ్రామాల జి ఎం ఎస్ కె లు ఈ విధంగా పనిచేస్తే ప్రజల్లో మరింత అవగాహన వస్తుందని ప్రజలు భావిస్తున్నారు

## సమతుల్య ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి: సీడీపీవో వాణి



**కోడూరు,అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** గర్భిణులు, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అంగన్వాడీ ప్రాజెక్టు అధికారి (సీడీపీవో) వాణి సూచించారు. శనివారం మందపాకల అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పోషకాహారం, పిల్లల ఆరోగ్యం, బాల్య విద్య ప్రాధాన్యత గురించి వివరించారు. భారతీయ జనతా పార్టీ నాయకులి కొండవీటి రామకృష్ణ అంగన్వాడి కార్యకర్తలను దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు జ్యోతి, సుధ, అంగన్వాడీ టీచర్లు నాగమణి, కల్యాణి, సౌభాగ్యం, వనజ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అధికారిక ధృవీకరణకు ప్రతీకగా ప్రభుత్వ పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తుంది

–వేములకొండ వెంకటేశ్వరరావు

**● వెంకటాపురం, కట్టుబడిపాలెంలో రైతులకు పట్టాదారుపాస్ పుస్తకాలు పంపిణీ**







**జి.కొండూరు(వెంకటాపురం),అక్టోబర్ 3 (వార్తాప్రభ) :** అధికారిక ధృవీకరణకు ప్రతీకగా ప్రభుత్వ రీ సర్వే చేసి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజే స్తున్నట్లు జి.కొండూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ లో భాగంగా జి.కొండూరు మండల పరిధిలోని వెంకటాపురం,కట్టుబడిపాలెం గ్రామాలలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లంక నాగేశ్వరరావు ఆ గ్రామ పార్టీ నాయకులతో కలిసి శనివారం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. వెంకటాపురం,కట్టుబడి పాలెం గ్రామ శివారు కడింపోతవరం గ్రామాలలో నిర్వహించిన రీ–సర్వే ప్రక్రియలో భాగంగా పలువురు పట్టాదారులకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయడం జరిగిందని వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.రిబ్కా రాణి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ షేక్.షీమా బేగం,ఏఎంసీ మాజీ చైర్మన్ వుయ్యూరు నరసింహారావు, వెంకటాపురం గ్రామ తెదేపా నాయకులు కేసరి వెంకటేశ్వర రెడ్డి, కట్టుబడిపాలెం టీడీపీ నాయకులు బుస్సు కోటేశ్వరరావు,ఆ గ్రామాల వీఆర్వో లు, వి ఆర్ ఏ లు,గ్రామ రైతులు పాల్గొన్నారు.

